# ప్రజాపక్షం
## జిల్లా అనుబంధం
నల్లగొండ సూర్యాపేట యాదాద్రి

మంగళవారం | 09 ఏప్రిల్, 2024 | పేజీలు : 4





ఆరు గ్యారంటీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నాం మెయిన్‌లో


## ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలి

**ఆర్‌డిఒ వేణుమాధవ్**



**ప్రజాపక్షం/నూతనకల్ :** ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆర్డీవో వేణుమాధవ్ నిర్వాహకులకు సూచించారు. సోమవారం మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని గుండ్లసింగారం, చిల్పకుంట్ల (పిఏసిఎస్) గ్రామాలలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు నాణ్యమైన ధాన్యాన్ని తీసుకవచ్చి ప్రభుత్వ మద్దతు ధర పొందాలని, తేమ శాతం 17 మించకుండా ఆరబెట్టిన నాణ్యమైన ధాన్యాన్ని తీసుకరావాలన్నారు. కొనుగోలు కేంద్రంలో ఉన్న రైతులతో మాట్లాడి ధాన్యం తేమ శాతాన్ని మిషన్‌ద్వారా పరిశీలించి చూశారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చూడాలని నిర్వాహకులకు సూచించారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో టార్పాలిన్లు,షెడ్ నెట్లు ఉండే విధంగా చూడాలని పేర్కొన్నారు.కొనుగోలు చేసిన వెంటనే ఓపిఎంఎస్‌లో రైతుల వివరాలను నమదు చేసి రైతుల అకౌంట్లో నగదు జమయ్యేటట్లు చర్యలు తీసుకోవాలని తెలిపారు.అనంతరం మండల పరిధిలోని బిక్కుమల్ల గ్రామంలోని మమత బిన్నీ రైస్‌మిల్‌ను తనిఖీచేసి సిఎంఆర్ ధాన్యంను వెంటనే ఎఫ్‌సిఐకి తరలించాలని మిల్లు యజమానికి సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపిడివో సునిత,వ్యవసాయ అధికారి మురళిబాబు,ఏపిఎం కరుణాకర్, ఏఈవో జానయ్య,ఆర్‌ఐ ప్రసాద్,కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, రైతులు పాల్గొన్నారు.

## విద్యార్థినులపై లైంగిక వేధింపులు

**ఉపాధ్యాయుడిపై కేసు నమోదు**



**ప్రజాపక్షం/గుండాల :** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల కేంద్రంలోని స్థానిక ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా అండం మాధవరెడ్డి విధులు నిర్వహిస్తున్నాడు. ఇదే తరుణంలో కొన్ని రోజుల నుండి పాఠశాలలోని విద్యార్థినిలతో అతి వినయం ప్రదర్శిస్తూ విద్యార్థులకు డబ్బులను చూపిస్తూ అదే తడువుగా వారి యొక్క శారీర భాగాలను తరుచూ తడుముతుండేవాడని విద్యార్థులకు ఒంటి పూట బడులు నడుస్తుండడంతో సోమవారం విద్యార్థినిలు పాఠశాల నుండి అలస్యంగా రావడంతో వారి తల్లితండ్రులు పిల్లలను అడగగా పాఠశాలలో జరిగిన విషయం వారి తల్లితండ్రులకు తెలపడంతో తక్షణమే విద్యార్థుల తల్లితండ్రులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం జరిగింది. స్థానిక ఎస్‌ఐ యాకన్న తెలిపిన వివరాల ప్రకారం విద్యార్థులపై ఉపాధ్యాయుడు లైంగిక వేధింపులకు పాల్పడుతున్నట్లు విద్యార్థుల తల్లితండ్రులు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో కేసు నమోదు చేసుకొని నిందితుడిని విచారిస్తున్నట్లు ఆయన తెలిపారు.

## కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో.. ప్రజలకు ఇబ్బందులు

**ప్రజాపక్షం/వలిగొండ :** వలిగొండ నుండి తొర్రూరు వరకు జరుగుతున్న రోడ్డు పనులు విస్తరణలో కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనబడుతుంది. కనీసం ప్రమాణాలు పాటించని కాంట్రాక్టర్ వలిగొండ మండల పరిధిలోని లోతుకుంట గ్రామం వద్ద బ్రిడ్జి నిర్మాణం చేస్తున్నారు. మరో పక్క పెద్ద పెద్ద గుంతలతో నిర్మాణ పనులు జరుగుతున్నాయి. అదే చోట సరైన సూచక బోర్డులు ఏర్పాటు చేయలేదు. అసలే ఎండాకాలం వచ్చి పోయే వాహనాల దుమ్ముతో బైకు, ఆటోలలో ప్రయాణిస్తున్న ప్రయాణికులకు తీవ్రమైన ప్రమాదాలు బారిన పడుతున్నారు. రోడ్డుపై నీళ్లు చల్లకుండా కాంట్రాక్టర్లు తప్పించుకొని చేతులు దులుపుకుంటున్న వైనం. ఇకనైనా అధికారులు వెంటనే స్పందించి కాంట్రాక్టర్లపై తగు చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎల్లంకి మహేష్ డిమాండ్ చేశారు.



## నల్లబెల్లం, నాటుసారా పట్టివేత



**ప్రజాపక్షం/మద్దిరాల :** మండల పరిధిలోని మామిండ్ల మండవ గ్రామ శివారులో నాటుసారా తయారుచేసే 31 క్వింటాల 50 కేజీల నల్లబెల్లం, 15 కేజీల పట్టికను, 20 లీటర్ల నాటుసారాను నల్లగొండ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిఐ రాకేష్, మలేష్, గోపాలరావు, తుంగతుర్తి ఎక్సైజ్ ఎస్‌ఐ మూర్తి ఆధ్వర్యంలో సోమవారం దాడులు నిర్వహించగా అక్రమంగా బోలెరో వాహనంలో, అప్పి ఆటోలో రవాణా చేస్తున్న నల్లబెల్లం పట్టికను, నాటుసారాను స్వాధీనం చేసుకుని సీజ్ చేసి మామిండ్ల మండలం గ్రామానికి చెందిన షేక్ సైదులు,శివకుమార్‌పై కేసు నమోదు చేసినట్లు వారు తెలిపారు. వారి వెంట ఎన్‌ఫోర్స్‌ంట్ సిబ్బంది, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

## తాగునీటిపై ప్రత్యేక దృష్టి సారించాలి

**పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల కార్యదర్శి అనితా రామచంద్రన్**



**ప్రజాపక్షం/యాదాద్రి కలెక్టరేట్ :** తాగునీటికి ఎలాంటి ఇబ్బందులు ఏర్పడకుండా జిల్లాలో ముందస్తు చర్యలు తీసుకోవాలని తాగు నీటి సరఫరా యాదాద్రి భువనగిరి జిల్లా ప్రత్యేక అధికారిణి, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల కార్యదర్శి అనితా రామచంద్రన్ అన్నారు. ప్రతి ఇంటికి తాగు నీరు అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ఆమె జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో గ్రామాలు, మున్సిపాలిటీలలో తాగు నీటి సరఫరాపై మిషన్ భగీరథ, మున్సిపల్, ఇంజనీరింగ్, ఎంపీడీవో అధికారులతో మండలాలు, మున్సిపాలిటీల వారీగా సమీక్షించారు. అన్ని గ్రామాల్లో, వార్డులలో రోజు వారీగా తాగు నీరు సరఫరా వివరాలు అడిగి తెలుసుకున్నారు. వేసవిలో ప్రజలు ఇబ్బంది పడకుండా ప్రతి ఇంటికి తాగునీరు వెళ్లాలని, ఇంజనీరింగ్ అధికారులు, ఎంపీడీవోలు క్షేత్రస్థాయిలో గ్రామాలలో పర్యటించి తాగునీటి సమస్యలు లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. రాబోయే రోజులలో ఎక్కడైనా తాగు నీటి సమస్య ఉత్పన్నమైతే తక్షణమే చక్కదిద్దేందుకు యాక్షన్ ప్లానుతో సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. ముఖ్యంగా అన్ని తాగు నీటి వనరులను శుభ్రం చేయించడంతోపాటు, తప్పనిసరిగా ప్రతినెల 1, 11, 21 తేదీలలో ట్యాంకులను శుభ్రం చేయాలని, ప్రతి రోజు క్లోరినేషన్. చేపట్టాలని తెలిపారు. ఎక్కడైనా ట్యాంకర్లతో నీరు సరఫరా చేస్తున్నట్లు ఉంటే శుభ్రంగా ఉన్న వాటిని వినియోగించాలని ఆదేశించారు. మండలాల ప్రత్యేక అధికారులు,


తరువాయి 2లో

## ఆర్థిక సాయం అందజేత

**ప్రజాపక్షం/మాడుగుల పల్లి :** మండలంలోని ఇందుగుల గ్రామానికి చెందిన ఫర్టిలైజర్ డీలర్ తోట శ్రీను వారం రోజుల క్రితం బ్రెయిన్ స్ట్రోక్ తో అకాల మరణం చెందాడు అతని కుటుంబాన్ని సోమవారం మాడుగులపల్లి మండల ఫర్టిలైజర్స్ షాప్స్ యూనియన్ సభ్యులు కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.40వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు మీలా రాంబాబు, కార్యదర్శి కట్టా సిద్ధార్థ రెడ్డి, గౌరవ అధ్యక్షుడు నాతాల రాంరెడ్డి, అగ్రికల్చర్ ఏవో సైదా నాయక్,డీలర్లు భాస్కర్ రెడ్డి, శ్రీనివాస్,నాగేశ్వర రావు,సైది రెడ్డి,గురవయ్య,దయాకర్, రాములు తదితరులు పాల్గొన్నారు.

## మతాలు వేరైనా మానవులంతా ఒక్కటే



**ప్రజాపక్షం/నందికొండ :** నందికొండ మునిసిపాలిటీ పరిధి లోని స్థానిక హిల్ కాలనీలో యూనిటీ ఆఫ్ ఉమ్మహ్ ఆధ్వర్యంలో ముస్లిం మైనార్టీ సోదరులు స్థానిక కమలా నెహ్రూ ఆసుపత్రిలో రంజాన్ నెల ఉపవాసముల సందర్భంగా మతాలు వేరైనా మానవులంతా ఒక్కటేనని కుల మతాలకు అతీతంగా అందరిలో సేవా దృక్పదం కలగాలని సోమవారం రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డా చక్రవర్తి స్థానిక మస్జిద్ కమిటీ సభ్యులు, ముస్లిం మత పెద్దలు హాఫీజ్ అబ్దుల్ వాహెద్, సుభాని,షబ్బీర్, ముజ్జు భాయ్, నసీర్ భాయ్,ఖాజా భాయ్,షరీఫ్ భాయ్,జమీర్ భాయ్,ఆదిల్ భాయ్,సయ్యద్ నసీరుద్దీన్ పాల్గొన్నారు.

## అనారోగ్య బాధితులకు ఆర్థిక సహాయం



**ప్రజాపక్షం/మోటకొండూర్ :** మోటకొండూరు మండలంలోని సికిందర్ నగర్ లో అన్న మేరీ అనే నిరుపేద అనారోగ్యంతో బాధపడుతున్నారని తెలుసుకొని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు యెల్లంల సంజీవ రెడ్డి అన్నమేరీని పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితి గురుంచి అడిగి తెలుసుకుని రూ.5 వేల ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో సికిందర్ నగర్ కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షులు పసల ప్రదీప్, యాదాద్రి భువనగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి నెమ్మని సుబ్రహ్మణ్యం, మండల మాజీ ఉపసర్పంచ్ ఫోరం అధ్యక్షులు ఎలిమినేటి జంగారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## దేశ సమైక్యకు క్రైస్తవుల ప్రత్యేక ప్రార్ధన

**ప్రజాపక్షం/సూర్యాపేట(ఆత్మకూర్ ఎస్) :** దేశ సమైక్యతకు ప్రతి ఒక్కరు పాటుపడాలని జిల్లా పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు దుర్గం ప్రభాకర్ అన్నారు. సోమవారం ఆత్మకూర్(ఎస్) మండల పరిధిలోని నెమ్మికల్ గ్రామంలోని డబ్ల్యూఎంఇ షాలోం ప్రార్ధన మందిరంలో మండల అధ్యక్షులు శాంతయ్య ఆధ్వర్యంలో కమిటీ సమావేశం నిర్వహించారు. అనంతరం దేశ సమైక్యత కోసం క్రైస్తవులతో కలిసి ప్రత్యేక ప్రార్ధన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని కులాలు, మతాలతో భిన్నత్వంలో ఏకత్వంనికి భారత దేశం నిదర్శనం అన్నారు.

## ఆధ్యాత్మిక సౌరభాలు గ్రామాలకు రక్ష : ఎంఎల్ఎ



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** ఆధ్యాత్మిక సౌరభాలు గ్రామాలకు ప్రజలకు రక్ష అని ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. మండలంలోని ఇంద్రియాల గ్రామంలో జరిగిన శ్రీశ్రీశ్రీ సంకెళ్ళ మైసమ్మ జాతర మహోత్సవంలో ఆదివారం రాత్రి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి సాంస్కృతిక కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తి సాంస్కృతిక కళలతో ఆధ్యాత్మిక చింతనతో పాటు మనుషుల మధ్య సమ భావన పరిఢవిల్లుతుందని ప్రతి సంవత్సరం వచ్చే ఆధ్యాత్మిక జాతర మహోత్సవాలు జాతి ఐక్యతను పెంపొందిస్తాయని అన్నారు. నిజజీవితంలో ప్రతి ఒక్కరూ భక్తి భావాన్ని పెంపొందించుకుంటే ఆర్థిక క్రమశిక్షణతో పాటు విలువలతో కూడిన జీవితం అలవాటవుతుందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పార్టీ తరపున దేవాలయాల అభివృద్ధికి, గ్రామ ప్రజా సంక్షేమం అభివృద్ధి కోసం కృషి చేస్తానని అన్నారు. పార్టీలకతీతంగా ప్రజలందరూ కలిసి జాతరను జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. త్వరలో జరగబోయే పార్లమెంటు ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న చామల కిరణ్ కుమార్ రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఇదే రోజు జిల్లా పరిషత్ చైర్మన్ ఎలిమినేటి సందీప్ రెడ్డి, ఎంపీపీ మాడుగుల ప్రభాకర్ రెడ్డి ముఖ్య ప్రజా ప్రతినిధులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున అమ్మవారికి బోనాలు సమర్పించుకుని మొక్కులు తీర్చుకున్నారు. మైసమ్మ తల్లిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. సాంస్కృతిక కార్యక్రమాలలో కళాకారులు చేసిన డాన్స్‌లు అందరినీ అలరించాయి. ఈ కార్యక్రమంలో డిసిసి ఉపాధ్యక్షులు సామ మధుసూదన్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ కిసాన్ జిల్లా అధ్యక్షులు మర్రి నరసింహారెడ్డి, మండల పార్టీ ఉపాధ్యక్షుడు శ్రీశైలం, గ్రామ శాఖ అధ్యక్షుడు లింగస్వామి, రాజు, మాజీ సర్పంచ్ అలివేలు, టింగిల్ కార్ వెంకటేశం, నోముల మాధవరెడ్డి బండి కృష్ణ గౌడ్, పెద్ది రెడ్డి యాదగిరి, వివిధ పార్టీ ముఖ్య నాయకులు, ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు, వివిధ యువజన సంఘాల నాయకులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఇండ్ల మధ్యే మురుగునీరు



**ప్రజాపక్షం/చౌటుప్పల్ :** చౌటుప్పల్ మున్సిపాలిటీలోని 18వ వార్డులో ఇళ్ల మధ్య మురుగునీరు ప్రవహిస్తుండడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని కాలనీవాసులు పత్రికా ప్రకటనలో తెలిపారు. ఇండ్ల మధ్య మురుగు కాలువలు ఉండడం వల్ల దోమల బెడద, పందుల సంచారంతో తీవ్ర నరకం అనుభవిస్తున్నామని అన్నారు. కాలనీవాసులు అనారోగ్యాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నీటి ఎద్దడి కూడా విపరీతంగా ఉందని తెలిపారు. చౌటుప్పల్ మున్సిపల్ కమిషనర్ కాలనీని పర్యవేక్షించిన కూడా ఎలాంటి పనులు జరగలేదని తెలిపారు. తక్షణమే డ్రైనేజీ నిర్మాణం చేయాలని కోరారు. ప్రకటన పెద్దలు చేసిన వారిలో కాలనీవాసులు ఎర్రబోతు వెంకట్ రెడ్డి, గండికోట సత్తయ్య, గండికోట వెంకటేష్, కాసోజు లింగం, చిలుకూరి సాంబశివ, సుజాత, యశోద తదితరులు ఉన్నారు.

## తాగునీటిపై ప్రత్యేక దృష్టి సారించాలి

(మొదటి పేజీ తరువాయి)

ఇంజనీరింగ్ అధికారులు పురోగతిలో ఉన్న తాగునీటి పనులన్నింటిని యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని, గ్రామాల వారిగా పనులను సమీక్షించాలని అన్నారు. తాగునీటి అవసరాలకు ఎస్డిఎఫ్ నిధులు, డిపార్ట్మెంటు, గ్రామ పంచాయతీ నిధులను వినియోగించుకోవాలని సూచించారు. మండల స్పెషల్ ఆఫీసర్లు, మండల అభివృద్ధి అధికారులు క్షేత్రస్థాయిలో గ్రామాలను వార్డులను ప్రతిరోజు పరిశీలించాలని, ముందస్తు ఏర్పాట్లలో భాగంగా అవసరమైన చోట ట్యాంకర్లను, ప్రైవేటు బోర్లను సిద్ధంగా ఉంచుకోవాలని ఆదేశించారు. వచ్చే రెండు నెలలు జాగ్రత్తగా ఉండాలని, ప్రజలకు తాగునీరు అందించడం మొదటి ప్రాధాన్యతగా అధికారులందరూ సమిష్టిగా పనిచేసి తాగునీటి సమస్యలను అధిగమించాలని, జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రతిరోజు మానిటరింగ్ చేయాలని సూచించారు. అనంతరం జిల్లాలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆమె సమీక్షించారు.అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఉపాధి హామీ పని కల్పించాలని ఆదేశించారు.అంతకు ముందు రాష్ట్ర పంచాయితీరాజ్ కమీషనర్ అనితా రామచంద్రన్ యాదగిరిగుట్ట మండలం వంగపల్లి గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు. చెరువు పూడికతీత పనులు నిర్వహిస్తున్న కూలీలతో ఆమె మాట్లాడారు. వారికి అందుతున్న వేతన వివరాలు అడిగి తెలుసుకున్నారు. కూలీలకు సరైన వేతనాలు వచ్చేలా చూడాలని, వేసవి దృష్ట్యా వారితో ఉదయమే పనులు చేపట్టాలని, పని ప్రదేశాలలో నీడ, మంచినీటి వసతి తప్పనిసరిగా ఉండాలని అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టరు హనుమంత్ కే.జెండగే మాట్లాడుతూ జిల్లాలో 421 గ్రామాలతో 726 హ్యాబిటేష్లు, 6 మున్సిపాలిటీలలో వేసవిలో మూడు సెగ్మెంట్ల ద్వారా ఆర్.డబ్ల్యూ.ఎస్. ద్వారా త్రాగునీటి సరఫరా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.సమీక్షలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టరు కె.గంగాధర్, జిల్లా పరిషత్ సిఇఓ శోభారాణి, మిషన్ భగీరథ సూపరింటెండింగ్ ఇంజనీరు కృష్ణయ్య, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి ఎం.ఎ.కృష్ణన్, జిల్లా పంచాయితి అధికారి సునంద, మిషన్ భగీరథ డివిజనల్ ఇంజనీర్ కరుణాకర్, ఆఫీసర్లు, ఎంపిడిఓలు, ఇంజనీర్లు, పాల్గొన్నారు

## చైన్ స్నాచర్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి




**ప్రజాపక్షం /మునుగోడు :** చైన్ స్నాచింగ్ దొంగల పట్ల మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మునుగోడు ఎస్ఐ సిహెచ్ వెంకటేశ్వర్లు తెలిపారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లాలో చైన్ స్నాచింగ్ దొంగలు తిరుగుతున్నారని ఒంటరిగా బయటికి వెళ్లే మహిళలు జాగ్రత్తగా ఉండాలని రోడ్డు వెంట నడిచేటప్పుడు ఎవరైనా అనుమానిత వ్యక్తులు బండి మీద తిరిగినట్లయితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని 100 నెంబర్‌కు ఫోన్ చేయాలని తెలిపారు.

## దరఖాస్తుల ఆహ్వానం

**ప్రజాపక్షం/సూర్యాపేట :** తెలంగాణ రాష్ట్ర మైనార్టీస్ స్టడీ సర్కిల్, మైనార్టీ సంక్షేమ సాఖల ఆధ్వర్యంలో యుపిఎస్‌సి, సిఎస్‌ఎటి 2025కు పరీక్షల కోసం 2024/25 విద్యా సంవత్సరానికి మైనార్టీ అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి కె జగదీశ్వర్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహిళ అభ్యర్థులకు 33.33శాతం సీట్లు, అన్ని రిజర్వ్ కేటగిరిలలో వికలాంగులకు 5శాతం సీట్లు కేటాయించినట్లు చెప్పారు. ఈనెల 12 తేదీ నుండి 22 తేదీ వరకు www.tmreistelangana.cgg.gov.in వెబ్ సైట్ ద్వారా దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. ఈనెల 28న దరఖాస్తు చేసుకున్న అభ్యార్థులకు జిల్లా కేంద్రంలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో స్క్రీనింగ్ టెస్టు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాల కోసం జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ కార్యాలయంలో సంప్రదించాలని చెప్పారు.

## శ్రీ క్రోధినామ సంవత్సరంలో అందరికీ శుభాలు జరగాలి



**ప్రజాపక్షం/సూర్యాపేట :** శ్రీ క్రోధి నామా సంవత్సరంలో సూర్యాపేట జిల్లా ప్రజలకు శుభాలు జరిగి సుఖసంతోషాలతో ఉండాలని రాష్ట్ర పౌర సరఫరాల, నీటిపారుదల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఆకాంక్షించారు. తెలుగు నూతన సంవత్సరంలో సమృద్ధిగా వానలు కురిసి పంటలు బాగా పండాలని, రైతు ఇంట్లో సిరులు కురవాలన్నారు. పల్లెలు, పట్టణాలు కళకళ లాడాలని అన్నారు. వీరితో పాటు సూర్యాపేట శాసన సభ్యులు గుంటకండ్ల జగదీష్ రెడ్డి, టిపిసిసి సీనియర్ ఉపాధ్యక్షులు, సూర్యాపేట నియోజకవర్గ ఇన్ చార్జీ రాంరెడ్డి దామోదర్ రెడ్డి, రాష్ట్ర పర్యాట శాఖ కార్పోరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డిలు వేర్వేరు ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు.

## రంజాన్ పండగకు నిత్యావసర సరుకుల పంపిణీ



**ప్రజాపక్షం/చౌటుప్పల్ :** రంజాన్ పండుగకు నిరుపేద ముస్లింలకు చౌటుప్పల్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులను ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ నిరుపేదల ముస్లింలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని అన్నారు. రంజాన్ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ భువనగిరి ఎంపీ అభ్యర్థి చామల కిరణ్ కుమార్ రెడ్డి, చౌటుప్పల్ ఎంపీపీ తాడూరి వెంకట్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వెన్ రెడ్డి రాజు, లయన్స్ క్లబ్ జిల్లా కోఆర్డినేటర్ దాచేపల్లి ప్రకాష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు మోగుదాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## చీమల కొండూరులో పుస్తెలతాడు అపహరణ

**ప్రజాపక్షం/భువనగిరిరూరల్ :** మండలంలోని చీమలకొండూరు గ్రామ పరిధిలో ఆదివారం అర్ధరాత్రి చైన్ స్నాచింగ్ జరిగింది. సంఘటనకు సంబంధించి ఎస్సై వి.సంతోష్ కుమార్, బాధితురాలు పల్లెర్ల రేణుక తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని చీమల కొండూరు గ్రామానికి చెందిన పల్లెర్ల రేణుక, బాలస్వామి దంపతులు ముగ్గురు పిల్లలతో ఇంటి దాబాపై నిద్రిస్తున్న క్రమంలో ఆదివారం అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తి రేణుక మెడలో ఉన్న మూడున్నర తులాల పుస్తెల తాడు దొంగలించి పారిపోతుండగా నిద్రలేచిన బాధితురాలు వెంటనే కేకలు వేసింది. కేకలు వేయటంతో దొంగ తప్పించుకొని పారిపోయాడు. అప్రమత్తమైన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే భువనగిరి రూరల్ సిఐ ప్రభాకర్ రెడ్డి, ఎస్సైలు వి.సంతోష్ కుమార్, రమేష్‌లు సంఘటన స్థలానికి చేరుకున్నారు. బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# కాంగ్రెస్ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరికలు



ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ : పట్టణంలోని 30, 41 వ వార్డులకు చెందిన 80 మంది బీఆర్ఎస్ పార్టీకి చెందిన యువకులు పట్టణంలోని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి క్యాంపు కార్యాలయంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుమ్మల మోహన్ రెడ్డి, నల్గొండ మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. నూతనంగా పార్టీలో చేరిన వారికి కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమానికి ముందు కౌన్సిలర్ కేసాని వేణుగోపాల్ రెడ్డి వార్డు నుంచి మంత్రి క్యాంపు కార్యాలయం వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్,యువజన కాంగ్రెస్ నల్లగొండ అసెంబ్లీ అధ్యక్షుడు షేక్ జహంగీర్ బాబా పాల్గొన్నారు.

## కోతుల నివారణ చర్యలపై హర్షం

ప్రజాపక్షం/మోటకొండూర్ : మోటకొండూర్ మండలంలోని ఇక్కుర్తిలో కోతుల బెడదతో ప్రజలు ఇబ్బంది పడుతున్నందున మాజీ సర్పంచ్ చామకూర అమరేందర్ రెడ్డి, పిర్జాదిగూడ కార్పొరేటర్ దోంతిరి హరిశంకర్ రెడ్డి సహకారంతో సుమారు రూ.3 లక్షలు ఖర్చు పెట్టి గ్రామస్తుల నిర్ణయం మేరకు కోతులను పట్టే సిబ్బందితో 5 వందల కోతులను పట్టి సురక్షితంగా అటవీ ప్రాంతంలో వదిలేశారు. కోతుల నిర్మూలనకు సహకరించిన మాజీ సర్పంచ్ అమరెందర్ రెడ్డి, కార్పొరేటర్ దోంతిరి హరిశంకర్ రెడ్డిలకు గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, ప్రతి ఒక్కరు పాల్గొన్నారు.

## జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్ట పరిరక్షణ మా ధ్యేయం



ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్ట పరిరక్షణ సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నరసింహా అన్నారు. సోమవారం భూదాన్ పోచంపల్లి మండలం పిల్లాయిపల్లి గ్రామంలో సిపిఎం పార్లమెంట్ అభ్యర్థి యండి.జహంగీర్ ను గెలిపించాలని కోరుతూ ఇంటింట ప్రచారం నిర్వహించిన అనంతరం గ్రామంలోని జాతీయ గ్రామీణ ఉపాధి కూలీల పని ప్రదేశాన్ని సందర్శించి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల కార్యదర్శి పగిళ్ళ లింగారెడ్డి, సీనియర్ నాయకులు గూడూరు అంజిరెడ్డి, మండల కార్యదర్శి వర్గ సభ్యులు మంచాల మధు, గూడూరు బుచ్చిరెడ్డి, అందెల జ్యోతి, గ్రామ శాఖ కార్యదర్శి పత్తి బిక్షపతి నాయకులు బాత్క బిక్షపతి, బందెల బాలమణి, పగిళ్ల గంగారెడ్డి కాంజర్ల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## మద్దతు ధరతో పాటు బోనస్ ఇవ్వాలి



ప్రజాపక్షం/మోటకొండూర్ : తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మెనిఫెస్టోలో చెప్పిన విధంగా వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో కొనుగోలు చేసిన దాన్యానికి మద్దతు ధరతో పాటు క్వింటాలుకు 5 వందల రూపాయల బోనస్ ఇవ్వాలని.మండలంలోని ఇక్కుర్తి మాజీ సర్పంచ్ చామకూర అమరెందర్ రెడ్డి, బిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు మొగులయ్యలు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బి.మహేష్ కుమార్, ఎస్.ఆయిల్ పాండు, ఫినాప్ రెడ్డి, రాఘవ రెడ్డి, గవ్వల సాయమ్మ, సిహెచ్ మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## మూడోసారి మోడీని ప్రధానిని చేయాలి

ప్రజాపక్షం/ రామన్నపేట : పార్లమెంట్ ఎన్నికల్లో తనకు ఓటు వేసి దేశంలో మూడోసారి నరేంద్రమోడిని ప్రధానమంత్రిని చేయాలని భువనగిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్ అన్నారు. ప్రచారంలో భాగంగా మంగళవారం మండలంలోని ఇంద్రపాలనగరం, బోగారం, సిరిపురం, రామన్నపేట మండల కేంద్రంలో వివిధ కుల సంఘాల నాయకులు, యువజన సంఘం, మహిళ సంఘం నాయకులను కలిసి ఓట్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టులను దూషించిన వారిపై కేసు నమోదు

ప్రజాపక్షం/నాంపల్లి ; ఆదివారం మండల కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సిపిఐ మండల పార్టీ కార్యదర్శి సుదనబోయిన రమేష్ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతూ అక్రమ వసూళ్లకు దిగిన చిట్టెంపహాడ్ గ్రామ సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు గిరి స్వామిని కార్యవర్గ బాధ్యతల నుండి తొలగించిన జరిగింది. ఈ సందర్భంగా పలు వార్తా పత్రికలలో సోమవారం వార్తలు రావడంతో వార్తను ప్రచురించినందుకు గిరిస్వామి అతని సతీమని రమణ సోషల్ మీడియా వాట్సప్ గ్రూప్‌లలో జర్నలిస్టులను, మీడియా సంస్థలను కించపరిచే విధంగా పోస్టులు పెట్టి అసభ్య పదజాలంతో కులాల పేరుతో దూషిస్తూ ఇతర వ్యక్తులతో ఫోన్లో జర్నలిస్టుల మనోభావాలను దెబ్బతీసే విధంగా మాట్లాడినందున సిపిఐ మండల కార్యవర్గం ఆదేశాలనుసారం సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో గిరిస్వామి, రమణ, నర్సింహాలపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రెస్‌క్లబ్ ప్రెసిడెంట్ మన తెలంగాణ రిపోర్టర్ గురుపాదం, జర్నలిస్టులు ఫిర్యాదు చేయడం జరిగింది. ప్రెస్ క్లబ్ ప్రచార కార్యదర్శి సామాజిక తెలంగాణ రిపోర్టర్ వెంకటయ్య, ప్రజాపక్షం రిపోర్టర్ అయోధ్య, వెంకటేశ్వర్లు, దామోర సైదులు, కాటిక సైదులు తదితరులు పాల్గొన్నారు.

## చలివేంద్రాల ఏర్పాటు అభినందనీయం



ప్రజాపక్షం/నల్లగొండ : వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. సోమవారం పట్టణంలోని జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయం వద్ద సాయి శ్రీ కన్సల్టెన్సీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రజలకు వేసవిలో ఎండలు విపరీతంగా ఉన్న కారణంగా వేసవి కాలం పూర్తయ్యే వరకు చలివేంద్రంతో ప్రతిరోజూ స్వచ్ఛమైన తాగునీటిని అందించనున్నట్లు తెలిపారు. వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతోగానో ఉపయోగపడతాయని మరిన్ని కేంద్రాలు ఏర్పాటు చేయడానికి స్వచ్ఛంద సంస్థలు, దాతలు, ముందుకు రావాలన్నారు. సాయి శ్రీ కన్సల్టెన్సీ డాక్యుమెంటరీ రైటర్ మున్సిపల్ మాజీ కౌన్సిలర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు మొరిశెట్టి నాగేశ్వరరావు మాట్లాడుతూ గత 13 సంవత్సరాల నుండి తమ సంస్థ ఆధ్వర్యంలో జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయం వద్ద చలివేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వేసవిలో రోడ్ వెంబడి వెళ్లే బాటసారుల దాహార్తి తీర్చడానికి చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు గుమ్ముల మోహన్ రెడ్డి మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బ గోని రమేష్ గౌడ్,, కౌన్సిలర్లు కేసాని వేణుగోపాల్ రెడ్డి, సమ్మద్, కందుకూరి భద్రయ్య, జివి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు బిజెపిలో చేరనున్న పిల్లి



ప్రజాపక్షం/నల్లగొండ : ఆలిండియా పార్వర్డ్ బ్లాక్ పార్టీ నల్లగొండ అసెంబ్లీ నియోజవర్గ ఇంచార్జి పిల్లి రామరాజు యాదవ్ బిజెపిలో చేరేందుకు సిద్ధమయ్యారు. బిజెపిలో తన చేరికకు సంబంధించి ఇప్పటికే ఆయన కేంద్ర మంత్రి, పార్టీ అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డితో భేటీ అయ్యారు. పార్టీలో తన చేరిక..రాజకీయ భవిష్యత్తు వంటి అంశాలపై సుదీర్ఘంగా చర్చలు జరిపారు. బిఆర్ఎస్ నల్లగొండ పట్టణాధ్యక్షునిగా మున్సిపల్ కౌన్సిలర్‌గా పని చేసిన ఆయన స్థానిక మాజీ ఎంఎల్ఏ కంచర్ల భూపాల్‌రెడ్డి వ్యతిరేకత గళం విప్పి ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆలిండియా పార్వర్డ్ బ్లాక్ పార్టీ నుంచి బరిలో నిలిచారు. నియోజకవర్గంలో ఉన్న పరిచయాలు, యువతలో ఉన్న క్రేజ్‌తో గెలుస్తామనే ధీమాతో పోటీ చేయగా 27,960 పైచిలుకు ఓట్లు సాధించి ఒకవైపు బిఆర్ఎస్ కారు గుర్తు గెలుపుకు గండి కొట్టి తనదైన ముద్ర వేసుకున్నారు. ఇటీవల తన రాజకీయ భవిష్యత్తు పై అనుచరులు.. కార్యకర్తలు.. అభిమానులతో రామరాజు ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసుకున్నారు. 9న రాష్ట్ర అధ్యక్షులు కిషన్ రెడ్డి సమక్షంలో రామరాజు చేరికతో బిజెపికి నల్లగొండ పార్లమెంటు పరిధిలో రాజకీయంగా ఓట్ల పరంగా అదనపు బలం చేకూరనుందని పార్టీ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ముఖ్యంగా ఉమ్మడి నల్లగొండ జిల్లాలో యాదవ సామాజిక వర్గం ఓటర్లు గణనీయ స్థాయిలో ఉండటంతో ఆయన చేరిక పార్టీకి ప్రయోజనకరంగా ఉంటుందంటున్నారు.

## ఉగాది శుభాకాంక్షలు తెలిపిన గుత్తా



ప్రజాపక్షం/నల్లగొండ : తెలంగాణ రాష్ట్ర ప్రజలకు తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి క్రోధి నామ సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. షడ్రుచుల సమ్మేళనమే ఈ ఉగాది పండుగని, జీవితంలో వచ్చే కష్టసుఖాలను అందరూ అనుభవించాలని గుర్తు చేసేదే ఉగాది పచ్చడిని ఆయన చెప్పారు. క్రోధి సంవత్సరాది కాలం ప్రజలందరికీ కలిసివచ్చి , అందరూ కూడా సుఖ సంతోషాలతో జీవించాలని ఆయన తెలిపారు. యువత ఈ సంవత్సర కాలంలో తాము అనుకున్న లక్ష్యాన్ని సాధించాలని గుత్తా ఆకాంక్షించారు.

## గడ్డివాముకు నిప్పు... రూ 4.50 లక్షల నష్టం



ప్రజాపక్షం/హుజూర్‌నగర్ : మున్సిపల్ పరిధిలోని గోవిందాపురంలో ఆదివారం అర్ధరాత్రి 2 గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు గడ్డివాముకు నిప్పు పెట్టడంతో రూ.4.50లక్షల నష్టం వాటిల్లింది.వివరాల్లోకి వెళ్లితే గోవిందారంలోని 8వ వార్డుకు చెందిన దేవిశెట్టి నరేష్ వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు.తన పొలంలో ఉన్న గడ్డిని తీసుకవచ్చి ఇంటి స్వంత స్థలంలో గడ్డివాము వేసినాడు.కాగా ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు గడ్డివాముకు నిప్పు పెట్టడంతో 400 గడ్డివాము మోపులు కాలిపోయాయని దీంతో రూ.4.50లక్షల నష్టం వాటిల్లిందని బాధితుడు అశోక్ తెలిపారు.విషయం తెలుసుకున్న అగ్ని మాపకశాఖ అధికారులు, సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపులో తీసుకునివచ్చారు.ఈ సంఘటనపై బాధితుడు తహసీల్దార్, ఎస్ఐకి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

## ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

ప్రజాపక్షం / మిర్యాలగూడ : వేసవి సెలవుల్లో మండల పరిధిలోని 75 ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రకాల మౌలిక సదుపాయాల కల్పనకు ప్రణాళిక సిద్ధం చేశామని ఎంపీడీవో ఎం.శేషగిరి శర్మ తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ద్వారా చేపట్టబోయే పనులకు సంబంధించి ఆయన పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారితో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఆవాస ప్రాంతంలో సీనియర్ సంఘబంధం అధ్యక్షురాలు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీకి చైర్మన్‌గా నామినేట్ చేయబడ్డారని, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మెంబర్ కన్వీనర్‌గా వ్యవహరిస్తారని పేర్కొన్నారు. ప్రతి తరగతి నుంచి ముగ్గురు తల్లులతో తల్లుల కమిటీని ఏర్పాటు చేసి కమిటీ తీర్మానంతో పనులు చేపట్టే కాంట్రాక్టర్ను గుర్తిస్తామన్నారు. 75 పాఠశాలలకు మంచినీటి సౌకర్యం, మైనర్, మేజర్ రిపేర్, టాయిలెట్స్ రిపేర్, నూతన మరుగుదొడ్ల నిర్మాణం, విద్యుత్ తదితర పనులు చేపట్టేందుకు. రూ.2.75కోట్లతో అంచనాలు రూపొందించామని, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ పర్యవేక్షణలో పనులు ప్రారంభిస్తామని, పాఠశాల పునఃప్రారంభం నాటికి అన్ని పాఠశాలల్లో పనులు పూర్తయి అన్ని సౌకర్యాలతో అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో ఎంఈవో బాలాజీనాయక్, పీఆర్ ఏఈ చిల్లంచర్ల ఆదినారాయణ, సీనియర్ అసిస్టెంట్ భరద్వాజ్ తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కాంటాలు వేయక రైతులు నిరసన

ప్రజాపక్షం/అడ్డగూడూరు : మండలకేంద్రంలోని ఐకేపీ, పిఏసిఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి, ధాన్యం కాంటాలు వేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని రైతులు ఆందోళన చెందుతున్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఐకేపీ కేంద్రంలో రైతులు ధాన్యంకు నిప్పు అంటించి నిరసన వ్యక్తం చేశారు. సంబంధించిన అధికారులు, ప్రజాప్రతినిధులు తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయమై కొనుగోలు నిర్వాహకులను వివరణ కోరగా మిల్లులు కెటాయించలేదు, ఉగాది పండుగ తర్వాత ఇతర రాష్ట్రాలనుండి హమాలీలు వస్తారు. పండుగ తర్వాత కాంటాలు వేస్తామని తెలిపారు.

## ఆర్థిక సాయం అందజేత

ప్రజాపక్షం/నాంపల్లి ; మండల పరిధిలోని మహ్మదాపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు రాశిక శ్రీరాములు తండ్రి రాశిక చిన్నమల్లయ్య కొద్దిరోజు క్రితం అనారోగ్యంతో మరణించడం జరిగింది. సోమవారం వారి కుటుంబాన్ని పరామర్శించిన కాంగ్రెస్ నాయకులు రూ. 10వేల ఆర్థిక సాయం అందజేయడం జరిగింది. ఈకార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కత్తి రవీందర్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ నాయకులు ఎరెడ్ల రఘుపతిరెడ్డి, పూల వెంకటయ్య, సర్పంచ్ మలిగిరెడ్డి చంద్రారెడ్డి, గజ్జల శివారెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ వెంకట్‌రెడ్డి, గ్రామశాఖ అధ్యక్షులు శివ యాదవ్, ఆంజనేయులు, రాజు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎంఎల్ఏ



ప్రజాపక్షం /నార్కట్ పల్లి : పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా నార్కెట్‌పల్లి మండల కేంద్రానికి చెందిన యస్ కె సమ్మద్ స్వగృహంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బత్తుల ఊషయ్య, స్థానిక ఎంపిటిసి పాశం శ్రీనివాస రెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షుడు భారత్, పార్టీ నాయకులు ప్రజ్ఞాపూరం సత్యనారాయణ, ఇదు కుల్ల సంపత్,మాదాసు నర్సింహ్, ఐతరాజు వెంకన్న, ముస్లిం సోదరులు తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్ పట్టివేత

ప్రజాపక్షం/హుజూర్‌నగర్‌రూరల్ : అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్ఐ జి. ముత్తయ్య తెలిపారు. సోమవారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఉదయం పోలీస్ సిబ్బంది డ్యూటీ నిమిత్తం మండలంలోని అమరవరం గ్రామానికి వెళ్తుండగా మార్గమధ్యలో శ్రీనివాసపురం గ్రామశివారులో రాగానే శ్రీనివాసపుం గ్రామం నుండి టిఎస్ 29 ఎన్ 5458 నెంబర్ గల ట్రాక్టర్ డ్రైవర్ తురక సైదులు ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా వేములూరి వాగు నుండి సీతారాంపురం గ్రామానికి ఇసుక తరలిస్తుండగా పట్టుబడి చేసి కేసు నమోదు చేసినట్లు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## రైతు సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శుల ఎన్నిక

ప్రజాపక్షం/దేవరకొండ ; రైతు సంఘం దేవరకొండ మండల 4వ మహాసభ మండలంలోని తూర్పుపల్లి గ్రామంలో సోమవారం గంగిడి రాంరెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ మహాసభకు ముఖ్య అతిథులుగా సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి, మాజీ ఎంఎల్ఏ, రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉజ్జిని యాదగిరిరావు, ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహ, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మైనోద్దీన్‌లు హాజరు కాగా అనంతరం రైతు సంఘం దేవరకొండ మండల నూతన కమిటిని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా నాగవరం వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా గంగిడి రాంరెడ్డి, పాత్లావత్ ధర్మ, కార్యదర్శిగా పల్లా రంగారెడ్డి, సహాయ కార్యదర్శులుగా మద్ది వెంకటయ్య, జల్లళ్ల లింగమయ్య, కోశాధికారిగా మాధవరెడ్డి, కార్యవర్గ సభ్యులుగా అంజయ్య, పత్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మహాసభలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులుగా దేపా సుదర్శన్‌రెడ్డి, సిపిఐ మండల కార్యదర్శి పొర్లపల్లి కేశవరెడ్డి, సహాయ కార్యదర్శి నూనె రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

## రాత్రి సమయంలో మహిళలు జాగ్రత్తగా ఉండాలి

ప్రజాపక్షం/ఆలేరు : రాత్రి సమయంలో ఇంటి బయట లేదా ఇంటి పైన పడుకునే వారు జాగ్రత్తగా ఉండాలని ఆలేరు ఎస్సై వెంకట శీను అన్నారు. సోమవారం ఆలేరు పట్టణ కేంద్రంలో మాట్లాడుతూ మహిళలు మెడలో గొలుసులు, కాళ్ల మెట్టెలు దొంగిలించే అవకాశం ఉందని మన ఇంటి తలుపులు పగలగొట్టి ఇంట్లో విలువైన వస్తువులు, బంగారు ఆభరణాలు, డబ్బులు దొంగిలించే అవకాశం ఉంది కాబట్టి ఎవరికీ ఎటువంటి అవకాశం ఇవ్వకుండా జాగ్రత్త పడాలని పేర్కొన్నారు. అన్ని గ్రామాలకు సంబంధించిన పిల్లలు దరూ మీ కాలనీలో గస్తీ చేయాలని ఎవరైనా కొత్తగా మన గ్రామస్తులు కాకుండా వేరే వాళ్ళు నెంబర్ ప్లేట్ లేని బండ్ల మీద తిరిగిన వాళ్ళని ఆపి మీరెవరు ఇక్కడ ఎందుకు వచ్చిండ్రు అని అడుగుతూ మాకు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

## ఇష్టారాజ్యంగా రోడ్డు పనులు.. ప్రజల అవస్థలు



ప్రజాపక్షం/నాంపల్లి : నాంపల్లి మండల పరిధిలోని నాంపల్లి నుండి బంగారిగడ్డ వైపు మెయిన్ రోడ్డును డబల్ రోడ్డుగా విస్తరణ చేసే పనులు కొనసాగుతున్నాయి. రోడ్డు పనులు జరిగే సమయంలో ప్రయాణీకులు, పాదచారాలు వెళ్లేందుకు ప్రత్యామ్నాయ రోడ్డును ఏర్పాటు చేసి రోడ్డు పనులు చేపట్టాల్సిన కాంట్రాక్టర్లు ఈ పనులను పర్యవేక్షించాల్సిన అధికారులు సైతం వీటిని పట్టించుకోకుండా ఇష్టారాజ్యాంగా రోడ్డు పనులు కొనసాగిస్తున్నారు. అయితే పెద్దాపురం గ్రామ మధ్యలో జరుగుతున్న రోడ్డు పనులలో రోడ్డను బ్లాక్ చేసి పనులు చేపడుతున్నారు. గ్రామం మధ్యనే మెయిన్ రోడ్డు ఉండటం వల్ల కాంట్రాక్టర్ ఒకసైడు సిసి రోడ్లను వేస్తూ మరోసైడు వాహనాలు వెళ్లేందుకు ప్రత్యామ్నాయ రోడ్డును చూపాల్సింది పోయి రోడ్డు మొత్తం బ్లాక్ చేసి రోడ్డు వేయడంతో ఈ రోడ్డు గుండా వెళ్లే ప్రయాణీకులు, ప్రజలు, గ్రామస్తులు ప్రత్యామ్నాయ రోడ్డు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. గత కొద్ది రోజులుగా సాగుతున్న ఈ రోడ్డు నిర్మాణం పనులను ప్రయాణీకులు, ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుకుంటున్నారు.

## ధాన్యం కొనుగోలు కోసం రైతుల ఎదురుచూపులు



ప్రజాపక్షం/ భూదాన్ పోచంపల్లి : ఆరుగాలం కష్టపడి పండించిన వరి ధాన్యం కొనుగోలు కోసం ఐకెపి కేంద్రాల వద్ద రైతులు దిగాలుగా ఎదురుచూస్తున్నారు. వాతావరణ ఆకస్మిక మార్పుల దృష్ట్యా ఎప్పుడు ఏ రకంగా మారుతాయో తెలియక రైతులు ఆందోళన చెబుతున్నారు. పోచంపల్లి పట్టిన కేంద్రంలో పోలీస్ స్టేషన్ పక్కన ధాన్యాన్ని రాశులుగా పోసి వరుణుడు ఏ రూపంలో వచ్చి విరుచుకు పడతాడో నని భయంతో ధాన్యం రాశుల మీద పట్టాలు కప్పి బిక్కుబిక్కుమని రైతులు ఎదురుచూస్తున్నారు. ధాన్యం కొనుగోలు ప్రారంభం చేసినప్పటికీ నేటికి కూడా ఆచరణలో పెట్టకపోవడం రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వచ్చిన ధాన్యం వచ్చినట్టుగా ఎప్పటికప్పుడు తూకం వేసి ధాన్యాన్ని లారీలలో ఎగుమతి చేసినట్లయితే రైతులకు ఎలాంటి నష్టం కలగకుండా ఉంటుందని అంటున్నారు.ప్రభుత్వం ప్రకటించిన ప్రతి క్వింటాకు రూ. 500ల బోనస్ తో పాటు మండల పరిధిలోని అన్ని కొనుగోలు కేంద్రాల వద్ద రైతు ధాన్యాన్ని ఏ గ్రేడ్ కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు. పక్క మండలాలలో లేని విధానాన్ని కేవలం ఒక్క పోచంపల్లి మండలంలోనే పాటించటం రైతులను మోసం చేయడమేనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఏ గ్రేడ్ ధాన్యానికి కు రూ.2203, బి గ్రేడ్ కు రూ.2183 లుగా మద్దతు ధర ప్రకటించినప్పటికీ గత సీజనులో మూసి పరివాహక ప్రాంతంలో పండించిన వరి పంట మూలాన కేవలం ఒక్క ఈ మండలంలోనే బి గ్రేడ్ ధాన్యంగా తరుగు పేరు తో కొనుగోలు చేసి చేసి రైతుల కష్టాన్ని దోచుకున్నారని ఈ సారి మాత్రం గత పొరపాటు చేయకుండా రైతులకు కొనుగోళ్లలో వరి ధాన్యాన్ని ఏ గ్రేడ్ గా కొనుగోలు చేసి న్యాయం చేయాలని కోరుతున్నారు. తీరా పంట చేతికి వచ్చాక ఎప్పుడు ఏ క్షణాన మంచి ఏ ఉపద్రవం మీద పడుతుందో తెలియదు కాబట్టి వెంటనే ధాన్యాన్ని తూకం వేయాలని కోరుతున్నారు.

## మంచినీటి ట్యాంకులో కోతులు మృతిపై విచారణ జరపాలి



ప్రజాపక్షం/నందికొండ : నందికొండ మున్సిపాలిటీ పరిధిలోని స్థానిక హిల్ కాలనీలో గత బుధవారం మూడవ తేదిన వెలుగు చూసిన వాటర్ ట్యాంక్ లో కోతులు మృతిచెందిన సంఘటన పై సమగ్ర విచారణ జరపాలని కోరుతూ మానవహక్కులు,ప్రజావేగు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు కన్నె కంటి క్రాంతి కుమార్ నల్లగొండ జిల్లా కలెక్టర్‌కు వ్రాత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. త్రాగునీటి ట్యాంకులో కోతుల మృతిపై ప్రజా ఆరోగ్యం విషయమై నల్లగొండ డిఎం హెచ్‌వో ఆధ్వర్యంలో విచారణ జరిపించాలని కోరారు. ఈ విషయమై వన్యప్రాణి సంరక్షణ చట్టం 1972 ప్రకారం అటవీశాఖ అధికారులు, పశుసంవర్ధక శాఖ అధికారులు విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని, మృతి చెందిన కోతుల మృతదేహాలకు వైద్య పరీక్షలు, పోస్టుమార్టం నిర్వహించకుండా ఖననం చేసినందుకు సంబంధిత శాఖ అధికారులపై తగిన చర్యలు తీసుకుని వారికి షో కాస్ నోటీసులు జారీ చేయాలని అదేవిధంగా ఈ సంఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని కలెక్టర్ ను ఈ సందర్భంగా కోరినట్లు ఆయన తెలిపారు. ఆయన వెంట ప్రజావేగు సభ్యులు రైట్ టు ఇన్ఫర్మేషన్ యాక్ట్, డివిల్ ఎస్‌వి శివశంకరాచారి ఉన్నారు.

## సేవా దృక్పథం గొప్పది

ప్రజాపక్షం/నల్లగొండ : సేవా దృక్పథం గొప్పదని ప్రముఖ కవి వేణు సంకోజు పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని ఆర్టీసీ కాలనీలో శ్రీ సుంకరి ఫౌండేషన్ కార్యాలయంలో ప్రతిభా మూర్తులకు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉగాది పురస్కారాల బహుకరణ కార్యక్రమంలో పాల్గొని ఉగాది పురస్కారాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి సేవా కార్యక్రమాలను సుంకరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ఆయా రంగాలలో నిష్ణాతులైన కవులను మేధావులను రచయితలను స్వచ్ఛంద సంస్థల సేవలందిస్తున్న వారికి అవార్డులను సామాజిక దృక్పథం తో అందించడం అభినందనీయమన్నారు. సిపిఐ నాయకులు పబ్బు వీరస్వామి, జలసాధన సమితి అధ్యక్షులు దుశ్చర్ల సత్యనారాయణ, ప్రముఖ సంఘ సేవకులు కె. చిన్న వెంకటరెడ్డి, డాక్టర్ పుల్లారావు, కె పర్వతాలు, బొర్ర సుధాకర్, ఎల్.వి కుమార్, అంబటి వెంకన్న, మునాస వెంకన్న, ఎండి గౌస్ బాబా, ఉమ్మడి ఏపి చాంబర్ ఆఫ్ మాజీ చైర్మన్ పుల్లెంల వెంకట్ నారాయణ గౌడ్, బిసి సంఘం నాయకులు కంది సూర్యనారాయణ, మాద గోని బిక్షపతి, కొండూరు సత్యనారాయణ, తదితరులకు మెమెంటోలు శాలువలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పిఆర్ టి యు టి ఎస్ రాష్ట్ర నాయకులు సుంకరి బిక్షపతి, సుంకరి మల్లేష్ కళావతి, పంకజ్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.



## ఇంకుడుగుంతలు నిర్మిస్తేనే నిర్మాణాలకు అనుమతి

ప్రజాపక్షం / మిర్యాలగూడ : భవనాల నిర్మాణాల అనుమతికై దరఖాస్తు చేసుకునే వారు తప్పనిసరిగా ఇంకుడుగుంతలు నిర్మిస్తే అనుమతి ఇస్తామని మున్సిపల్ కమీషనర్ ఎండి.యూసుఫ్ తెలిపారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ప్లానర్స్ నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బహుళ అంతస్తుల భవనాలు, అపార్ట్‌మెంట్‌లు, వెంచర్ ప్లాన్లలో ఇంకుడుగుంతలు పొందుపరచాలని, నిర్మాణం చేస్తామని హామి ఉండాలని అన్నారు. అనావృష్టి ఉన్నా లేకున్నా తప్పనిసరిగా ఇంకుడుగుంతలు నిర్మించాలన్నారు. అదేవిధంగా భవన నిర్మాణ కోసం వచ్చే వారికి నిర్మాణాలుంటే ఆస్తి పన్ను ముందస్తు చెల్లిస్తే ఐదుశాతం రాయితీ ఉందని తెలిపారు. సమావేశంలో టీపీవో సోమయ్య, రెవెన్యూ ఆఫీసర్ టీ.కల్యాణిలు ఉన్నారు.

## కెసిఆర్ పేరుపై వైట్ పేపర్ అంటించిన అధికారులు

ప్రజాపక్షం / మిర్యాలగూడ : పట్టణంలోని ఎన్‌ఎస్పీ క్యాంపులో కేసీఆర్ కళాభారతి మినీ రవీంద్రభారతి ఆడిటోరియం ముందున్న పేరులో కేసీఆర్ పేరుపై అధికారులు వైట్ పేపర్ అంటించారు. ఎన్నికల షెడ్యూల్ విడుదల కాగానే రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు తొడిగించారు. అదేవిధంగా ఫ్లెక్సీలు, పోస్టర్లు తొలగించారు. గోడలపై రాతలు చెరిపివేశారు. ఇటీవల కాంగ్రెస్ నాయకులు మినీ రవీంద్రభారతికి కేసీఆర్ పేరు తొలగించాలని ఆర్డీవో శ్రీనివాస్‌రావుకు వినతిపత్రం అందచేశారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్టుకు వ్యతిరేకంగా ఉందని పేరు తొలగించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించడంతో సోమవారం కేసీఆర్ పేరుపై వైట్ పేపర్ అంటించారు.

## ప్రజల జీవితాల్లో ఉగాది నవవసంతం నింపాలి

ప్రజాపక్షం / మిర్యాలగూడ : నియోజకవర్గ ప్రజలకు మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఉగాది ప్రజల జీవితాల్లో నవవసంతాన్ని నింపి, శ్రీక్రోధి నామ సంవత్సరంలో ప్రజలు ప్రశాంతంగా జీవించేలా దీవించాలని ప్రకృతిమాతను ఆయన ప్రార్థించారు. కొత్త సంవత్సరంలో ప్రజలందరికి శుభం కలగాలని, ప్రజల ఆకాంక్షలు నెరవేరాలని ఆయన ఆకాంక్షించారు.

## ఉపాధిహామీ పనుల పరిశీలన

ప్రజాపక్షం / మిర్యాలగూడ : జాతీయ గ్రామీణ ఉపాది హామీ పథకంలో కూలీలు ప్రతి ఒక్కరికి రూ.300 వేతనం రావాలంటే రెండు మీటర్ల పొడవు, రెండు మీటర్ల వెడల్పు 0.43 మీటర్ల లోతు పూడిక తీయాలని ఎంపీడీవో శేషగిరి శర్మ అన్నారు. సోమవారం మండలంలోని సుబ్బారెడ్డిగూడెం, ఆలగడప చెరువుల్లో పూడిక తీస్తున్న పనులను ఆయన పరిశీలించి కూలీలతో మాట్లాడారు. ఎండలు తీవ్రంగా ఉన్నందున ఉదయం 6గంటలకే పనికి రావాలన్నారు. వడదెబ్బకు గురికాకుండా కూలీలు ఓఆర్‌ఎస్‌ను నీటిలో కలుపుకోని తాగాలన్నారు. ఆయన వెంట ఏపీవో కళావతి, ఈసీ పురుషోత్తం, టీఏలు సౌజన్య, రాజ్యలక్ష్మీ, ఎఫ్‌ఏలు తదితరులు ఉన్నారు.

## ప్రధానమంత్రి సురక్ష యోజన పథకం ప్రతి కుటుంబానికి రక్షణ

ప్రజాపక్షం/నేరేడుచర్ల : ప్రధానమంత్రి సురక్షభీమా యోజన పథకం ద్వారా ప్రతి ఏడాదికి కేవలం రూ.20లు చెల్లించి రూ.2లక్షల ప్రమాదభీమా పొందవచ్చని, పాలసీదారుడు అనుకోకుండా ఏదైనా ప్రమాదంలో మరణిస్తే ఆ కుటుంబానికి ప్రధానమంత్రి సురక్షభీమ యోజన పథకం అండగా ఉంటుందని ఎస్‌బిఐ రీజనల్ మేనేజర్ కోయ జ్యోతిలక్ష్మి అన్నారు. సోమవారం ఎస్‌బిఐ బ్రాంచ్‌ను ఆమె పరిశీలించారు.అనంతరం పిఎం సురక్షభీమా యోజన పాలసీదారుడైన మండలంలోని దిర్శించర్ల గ్రామానికి చెందిన దాసరి సైదులు ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై మృతిచెందగా నామిని లబ్ధిదారులు దాసరి రామనర్సమ్మకు రూ.2లక్షల విలువైన చెక్కును ఆమె అంద చేశారు.ప్రతి ఏడాదికి కేవలం వెయ్యి రూపాయల వార్షిక ప్రీమియంతో రూ.20 లక్షల ప్రమాద భీమా సౌకర్యం కల్పిస్తుందని ఖాతా దారులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.